

ట్రంక్‌లైన్ సమస్యపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో చర్చిస్తున్న పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

ట్రంక్‌లైన్ సమస్యను పరిష్కరించండి

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పలు కాలనీవాసుల విన్నపం

మన్సూరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ వద్ద చేపడుతున్న ట్రంక్‌లైన్ పనులు నిలిచిపోయాయని, వెంటనే ట్రంక్‌లైన్ పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని పరిసర కాలనీవాసులు కోరారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యేను కలిసిన ట్రంక్‌లైన్ పరిసర బాలాజీనగర్ ఫేజ్-2, లక్ష్మీభవానీకాలనీ, శ్రీరామ్‌నగర్‌కాలనీ, అంజలి రెసిడెన్సీ, స్వాతి రెసిడెన్సీ, లక్ష్మీప్రసన్నకాలనీ, ఆదర్శనగర్, పవనగిరి, ఎల్లారెడ్డి ఫేజ్-2 తదితర కాలనీవాసులు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. ట్రంక్‌లైన్ వేయాలంటే ఓ ప్రైవేటు వ్యక్తి స్థలం గుండా వేయాల్సి ఉండగా గతంలో సదరు స్థల యజమానిని ఒప్పించి స్థలం తీసుకుని ట్రంక్‌లైన్ వేసేందుకు ఒప్పించామని, కానీ సదరు స్థల యజమానిని స్థలం ఇవ్వొద్దంటూ కొందరు నాయకులు బెదిరించడంతో తను నిరాకరించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఏది ఏమైనప్పటికీ సదరు స్థల యజమానిని మళ్లీ ఒప్పించి ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ్‌గౌడ్‌కు అందెల అభినందన

సరూర్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 173వ ర్యాంకు సాధించిన నాదర్‌గుల్‌కు చెందిన ముద్దగోని కల్యాణ్‌గౌడ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అభినందించారు. గురువారం ఆయన పార్టీ నేతలతో కలిసి కల్యాణ్ నివాసానికి వెళ్లి స్వీటు తినిపించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నిమ్మల సునీతాగౌడ్, గూడెపు ఇంద్రసేన, అమిత, పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, పెత్తుల్ల పుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, పార్టీ నాయకులు తోట అమరేందర్‌రెడ్డి, జెనిగె శ్రీశైలంయాదవ్, యాతం వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నేతలు

వీహెచ్‌పీ నాదర్‌గుల్ ఖండ కమిటీ నియామకం

సరూర్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) వివేకానంద జిల్లా ప్రఖండ భాగమైన బడంగ్‌పేట్‌లోని నాదర్‌గుల్ ఖండ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం రాత్రి నాదర్‌గుల్‌లోని శంకర వేదాంత పీఠమైన వశిష్టాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి కళ్లెం రాజేందర్‌రెడ్డి పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. అనంతరం ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న వీర హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్

వీహెచ్‌పీ నాదర్‌గుల్ ఖండ కార్యవర్గంలో అధ్యక్షుడిగా కందికంటి శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్యాంసుందర్ పంతులు, భజరంగ్‌దళ్‌గా వలబోజు యశ్వంత్‌చారి, కార్యదర్శిగా అవినాశ్‌రెడ్డి, సహ కార్యదర్శిగా సిల్వేరి శ్రీధర్, సత్సంగ్ ప్రముఖ్‌గా ఉప్పలపాటి జగదీశ్వరరావు, సహ సత్సంగ్ ప్రముఖ్‌గా సిల్వేరి సిద్ధయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్‌లో వీరబ్రహ్మేంద్రస్వామి 76వ కల్యాణ రథోత్సవం ఘనంగా జరిగింది. అందులో భాగంగా గురువారం నిర్వహించిన రథోత్సవంలో తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ ముద్దం వీరస్వామియాదవ్, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం

మన్సూరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈనెల 6న నిర్వహించనున్న సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవానికి రావాలంటూ గురువారం మన్సూరాబాద్ డివిజన్ వీరన్నగుట్ట కాలనీవాసులు ఎల్బీనగర్‌లో టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు అంగిడి నాగేష్, భాను, మధు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు భీమిలి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం

● టీటీఐలో 72మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 72 మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో గురువారం 6 విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో అమరవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడిన వ్యక్తుల కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఆర్థిక సమస్యలకు తోడు ఇతర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. రాచకొండ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారి వీడియో క్లిప్స్ ప్రముఖుల సందేశాలు, మద్యంమత్తు అనర్థాలకు అద్దంపట్టే పాటలనూ ప్రదర్శించారు. టీటీఐ సిబ్బంది రమేష్ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలూ ప్రదర్శించారు.

445 మందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రమాదాలు నివారించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. టీటీఐ సిబ్బంది రమేష్ తదితరులు కమిషనరేట్ పరిధిలోని టాఫిక్ చిల్డ్రన్ పార్కు, ఎల్బీనగర్‌లోని కార్ల షోరూం, విజయవాడ బస్‌స్టాపు, ఆర్టీసీ కాలనీరోడ్డు, చింతలకుంట తదితర 9 ప్రాంతాల్లో నిబంధలను వాహనాల డ్రైవర్లకు, యజమానులకు, ప్రజలకూ వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు, సూచనలూ, రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యత, మద్యం మత్తులో వాహనాలు నడిపితే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన కోసం తయారు చేసిన ట్రాఫిక్ కరపత్రాలను 445 మందికి పంపిణీ చేశారు.

చలో హెచ్‌సీయూకు పిలుపు.. బీజేపీ నేతల అరెస్టు

మన్సూరాబాద్ : హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూమిని విక్రయించరాదని విద్యార్థులు చేపడుతున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు గురువారం బీజేపీ చలో హెచ్‌సీయూకు పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు బీజేపీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు హెచ్‌సీయూకి వెళ్లేందుకు సిద్ధమవ్వగా ముందస్తుగానే పోలీసులు వారిని హౌస్ అరెస్టు చేసి నాగోల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో కమిషన్ల కక్కుర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం వన్యప్రాణుల నివాసాలను కూల్చి ఆక్సిజన్ అందకుండా దుశ్చర్యకు పాల్పడుతోందని, ఈ చర్యను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హౌస్ అరెస్టు అయిన వారిలో బీజేపీ నేతలు సిద్దాల ఐలయ్య గౌడ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



కవాడిపల్లిలో కురుస్తున్న వర్షం



చైతన్యపురి చౌరస్తా వద్ద మొరాయించిన ద్విచక్రవాహనాలను నెట్టుకుంటూ వెళ్తున్న వాహనదారులు



చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జిపై వరద ప్రవాహం

జోరు వర్షం.. రోడ్లు జలమయం

● వరదతో మునిగిన మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డు
● చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్
● మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, సైదాబాద్, సంతోష్‌నగర్, కర్మన్‌ఘాట్, వనస్థలిపురం, హస్తినాపురం తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం కారణంగా వివిధ పనులపై బయటికి వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డు భారీ వర్షానికి పూర్తిగా వరదతో ముంచెత్తింది. ఒక దశలో ఆర్టీసీ సిటీ బస్సులు మినహా కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలతో సహా ఏ ఒక్క వాహనం రెండు గంటల పాటు రాకపోకలు సాగించలేకపోయాయి. వరదలో నుంచి ముందుకు సాగిన కారు అందులో చిక్కుకుపోయింది. విషయాన్ని గమనించిన మలక్‌పేట ట్రాఫిక్ కానిస్టేబుల్‌లు సహాయ చర్యల్లో భాగంగా వరదలో చిక్కుకున్న కారును వెనుక నుంచి నెట్టి బయటికి తీసుకువచ్చారు. అదేవిధంగా మూసారాంబాగ్ బ్రిడ్జిపై కూడా వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక్కడ కూడా ట్రాఫిక్ పోలీసులే వరద నివారణకు చర్యలు చేపట్టారు. ఇక చాదర్‌ఘాట్ కాజ్‌వే బ్రిడ్జిపై వర్షం, వరద కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు గంటపాటు వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డులో వరద నివారణకు చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

వరదలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

భారీ వర్షం కారణంగా మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డు వరదతో నిండిపోయింది. దీంతో ఇందులో నుంచి వాహనాలు రాకపోకలు సాగించలేకపోయాయి. ఆర్టీసీ సిటీ బస్సు వరదలో నుంచి వెళ్తే మొరాయించింది. బస్సులో ఉన్న ప్రయాణికులు భయంతో అరుపులు, కేకలు పెట్టారు. ఎవరికి వారుగా వరద నుంచి తప్పించుకోవడానికి బస్సు టాప్ పైకి చేరుకున్నారు. మరికొందరు బస్సు టాప్ నుంచి మళ్లీ కిందకు వరదలో దూకి తిరిగి బస్సులోకి వెళ్లారు. ఈవిషయాన్ని గమనించి స్థానికులు ఒక్కమారుగా ఉలికిపడ్డారు.



చైతన్యపురి-దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారిపై వరద ఉధృతి

మలక్‌పేట ఆర్‌యూబీ మూడో వెంట్ నుంచి అంబులెన్స్‌కు దారి

భారీ వర్షం కారణంగా మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డు భారీ వరదతో నిండిపోయింది. ట్రాఫిక్ సమస్య నివారణలో భాగంగా మలక్‌పేట ఆర్‌యూబీ రెండు వెంట్‌లకు అదనంగా మూడో వెంట్ నిర్మాణం పూర్తైంది. ప్రారంభానికి సిద్ధమైంది. ఇంకా అందుబాటులోకి రాలేదు. వాహనాలు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా భారీ వరద కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ జామ్‌లో రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ పేషంట్‌తో వెళ్తూ చిక్కుకుంది. ఈ విషయాన్ని గమనించిన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అందుబాటులోకి రాని మలక్‌పేట ఆర్‌యూబీ మూడో వెంట్ నుంచి అంబులెన్స్ వెళ్లేందుకు ఏర్పాటు చేశారు.

సరూర్‌నగర్‌లో వాన..

ఎల్బీనగర్ : సరూర్‌నగర్‌లో గురువారం మధ్యాహ్నం తర్వాత జోరుగా కురిసిన వర్షానికి రోడ్లపై వరదనీరు ప్రవహించింది. దీంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. బొల్లా కాంప్లెక్స్ వద్ద వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు కాస్తా ఆటంకం కలిగింది.

సైదాబాద్, చంపాపేటలలో..

సైదాబాద్ : భారీ వర్షానికి సైదాబాద్, మాదన్నపేట, ఐఎస్‌సదన్, చంపాపేట ప్రాంతాల్లో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరుతో వాహనదారులు, బాటసారులు సింగరేణి ఆఫీసర్స్‌కాలనీ, కృష్ణానగర్, ఆదర్శనగర్ కాలనీలు నీటితో ముంచెత్తాయి. శివగంగా థియేటర్ ముందు రోడ్డు, సింగరేణికాలనీ రోడ్డు, చంపాపేట డీమార్ట్ ముందు రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మాదన్నపేట మండీలో వరదనీటితో చెరువును తలపించింది.

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో మోస్తారు వర్షం కురిసింది. గాలి, ఉరుములతో కూడిన వర్షం కురవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురైనారు. చంపాపేట చౌరస్తాలోని డీమార్టు ముందు సాగర్ ప్రధాన రహదారిపై నీళ్లు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు కొందరు అందులో చిక్కుకున్నారు. స్థానిక యువకులు కొందరు రోడ్డుపై ఉన్న డివైడర్లను పక్కకు జరిపి నిలిచివున్న వర్షం నీటిని రెడ్డికాలనీ వైపు మళ్లించారు.

నాగోల్, మన్సూరాబాద్‌లలో రోడ్లు జలమయం

మన్సూరాబాద్ : నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, బస్తీలు, పలు కాలనీలు, ప్రధానరోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రజల రాకపోకలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి.

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లో అరగంట పాటు ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు తీవ్ర ఎండ కాచింది. మూడు గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఉరుములతో కూడిన వర్షం కురిసింది.

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల పరిధిలోని గ్రామాల్లో సుమారు 30 నుంచి 40 నిమిషాల పాటు వర్షం పడింది. పడిన నీరు పడినట్లుగానే భూమిలోకి ఇంకిపోగా సీసీ రోడ్లపై మాత్రం వరద నీరు కనిపించింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర శివారు ప్రజలు వర్షంతో చల్లబడ్డారు.



వీవీనగర్‌లో నేలకొరిగిన చెట్టును తొలగించేందుకు చర్యలు చేపడుతున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

గడ్డిఅన్నారంలో లోతట్టు కాలనీలను ముంచెత్తిన వరదనీరు

దిల్‌సుఖ్‌నగర్ : గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో వరదనీటి ముంపు సీన్ రిపీట్ అయింది. గతంలో మాదిరిగానే గురువారం కురిసిన వర్షానికి లోతట్టు కాలనీలను వరదనీరు ముంచెత్తింది. సరూర్‌నగర్ చెరువు నుంచి లోతట్టు కాలనీలైన శారదనగర్, సీసలబస్తీ, కోదండరామ్‌నగర్, వీవీనగర్, కమలానగర్, కృష్ణానగర్‌ల మీదుగా ప్రవహించిన వరదనీరు చైతన్యపురి చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ అన్నపూర్ణకాంప్లెక్స్ వరకు జాతీయ రహదారిపై నీరు నిలిచింది. కోదండరాంనగర్, న్యూగడ్డిఅన్నారం, కృష్ణానగర్‌కాలనీ, వివేకానందనగర్, కమలానగర్‌కాలనీల వీధులన్నీ వరదనీటితో నిండిపోయినవి. మోకాళ్ల లో తు వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి ఇళ్ల ముందు పార్కు చేసిన కార్లు సగానికి మునిగిపోగా, కమలానగర్‌లో ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయినవి.

రాకపోలకు తీవ్ర ఇబ్బంది

సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలైన శారదనగర్, కోదండరాంనగర్, న్యూగడ్డిఅన్నారం, వీవీనగర్, కమలానగర్‌ల మీదుగా వర్షపు నీరు చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిని ముంచెత్తింది. మోకాళ్లలోతు నీరు ప్రవహిస్తుండడంతో జాతీయ రహదారిపై వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ వరద ఉధృతిలో బైక్‌లు మొరాయించడంతో ద్విచక్రవాహనదారులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది.

సహాయక చర్యలు చేపట్టిన కార్పొరేటర్..

గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి వరదనీటి ముంపు కాలనీలలో పర్యటించి, సహాయక చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూతలు తీసి, చెత్తచెదారం తొలగించారు. రోడ్లపై పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించి, రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టారు.

మూసీలో చిక్కుకున్న ఇద్దరు యువకులు

చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసీ వద్ద ఉన్న శివాలయం వద్ద వీరయ్య, మరో యువకుడు పనులు చేస్తున్నారు. అయితే ఆ సమయంలో వర్షం రావడం, మూసీలో వరద ఉధృతి పెరగడంతో బయటకు రాలేకపోయారు. వెంటనే సమాచారం అందుకున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్, మేయర్ విజయలక్ష్మిల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ రంగయ్య, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత, ఈఈ శ్రీనివాస్, ఏఈ పార్వతిలు హుటాహుటిన రంగా నర్సింహతో కలిసి మూసీ వద్దకు వచ్చి రెస్క్యూ టీంతో కలిసి ఆ ఇద్దర్ని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు.

సృజనాత్మక, వినూత్న నైపుణ్యాలు అలవర్చుకోవాలి

● ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ మొలుగరం

మన్సూరాబాద్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి విద్యతో పాటు వినూత్న, సృజనాత్మక, కమ్యూనికేషన్ నైపుణ్యాలు తప్పనిసరిగా అలవర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం పేర్కొన్నారు. అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా నాగోల్‌లోని కల్యాణలక్ష్మీ గార్డెన్స్‌లో గురువారం తరంగ్-2కే 25 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొ.కుమార్ మొలుగరం, విశిష్ట అతిథులుగా టాస్క్ ఫౌండేషన్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, ఐసీఏఐ చాప్టర్ చైర్మన్ చిన్నసీతారామిరెడ్డి, సీఎస్ఆర్ అండ్ సోషియల్ ఎంటర్‌ప్రైజెస్ అడ్వైజర్, మెంటర్ విజయ్‌కుమార్ మచ్చ, ప్రత్యేక ఆహ్వానితులుగా బ్రహ్మకుమారీస్ సమాజ్‌కు చెందిన అంజలిలు విచ్చేసి అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ అధ్యక్షురాలు ఎం.జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, ఉపాధ్యక్షులు ఎంపీఎస్ఎస్ నందీష్, ఎండీ ఐ.శ్రవణ్‌కుమార్, డైరెక్టర్లు డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ డి.వెంకటరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం



పద్మశ్రీ మొగులయ్యను సత్కరిస్తున్న సీనియర్ న్యాయవాదులు

పద్మశ్రీ మొగులయ్యను సత్కరించిన న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలంపై కొందరు వ్యక్తులు కేసు వేయడంతో గురువారం పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగులయ్య రంగారెడ్డి జిల్లా కోర్టుకు వచ్చారు. విషయం తెలుసుకున్న సీనియర్ న్యాయవాదులు మొగులయ్యను సీనియర్ న్యాయవాదుల కార్యాలయానికి తీసుకెళ్లి సత్కరించారు. న్యాయవాదులమంతా న్యాయసహాయం చేస్తామని మొగులయ్యకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదుల జేఏసీ నాయకులు రామారావు, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, కొంతం గోవర్ధన్‌రెడ్డి, పొన్నం దేవరాజ్, మంత్రి రవీందర్, ఉపేందర్, నర్సింగ్‌రావుజీ, నిమ్మల కృష్ణగౌడ్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ సుజాతానాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కార్పొరేటర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్బీనగర్‌లోని తమ పార్టీ కార్పొరేటర్లతో పాటు ఇతర పార్టీల కార్పొరేటర్లను కలుపుకుని అభివృద్ధి పనులు చేపడుతుంటే ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. అప్రజాస్వామికంగా, రాజ్యాంగ విరుద్ధంగా మహిళా కార్పొరేటర్ అని చూడకుండా ఆమెపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించినా ఎలాంటి ఉపశమనం కలుగలేదని, చట్టప్రకారం ఎమ్మెల్యేను పోలీసులు తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నగరానికి వలస వచ్చిన నీవు.. నన్ను వలస వచ్చావని అనడం అవివేకం అన్నారు. గతంలో నీ ఆస్తులెంతా.. అక్రమంగా సంపాదించిన ఇప్పటి నీ ఆస్తులెంత అని ప్రశ్నించారు. ఎల్బీనగర్ నియోజవర్గంలో అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు ఈనెల 7న జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు వస్తున్నారని, ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేను కూడా అభివృద్ధి పనులకు ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కట్ల నర్సింహయాదవ్, శశిధర్‌రెడ్డి, నాయకులు భాస్కర్ యాదవ్, స్వర్ణమాధవి, సుజాత, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్, పక్కన కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్

ఎమ్మెల్యేపై కార్పొరేటర్ వ్యాఖ్యలు సరైంది కాదు

వనస్థలిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రోటోకాల్ విషయంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైంది కాదని మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వనస్థలిపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్‌తో కలిసి రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. వాటర్‌వర్క్స్ ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన పత్రాన్ని నిధులు మంజూరు చేసిన పత్రంగా చూపించిన కార్పొరేటర్ ఎమ్మెల్యేని విమర్శించడం సహించరానిదన్నారు. ఎమ్మెల్యే దగ్గర శిష్యరికం పొందిన నీవు ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేయడమేంటన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే పీఏ నీకు ఫోన్ చేసింది నిజం కాదా అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిట్టా రామ్మోహన్, రాజేష్, రవి, రాంబాబు, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

హయత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ఏరియాలోని ఛత్రపతి శివాజీ చౌరస్తా వద్ద శివంహిల్స్, శ్రీదుర్గానగర్‌కాలనీ, విష్ణునగర్, వీరన్నగుట్ట, శిర్డీసాయినగర్ కాలనీ, పవనగిరికాలనీ, ప్రగతినగర్‌కాలనీ, విజయనగర్‌కాలనీ, స్వాతి రెసిడెన్సీకాలనీ ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల ప్రజలు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్, కొండల్‌రెడ్డి, యాదగిరియాదవ్, కోటయ్య, కృష్ణారెడ్డి, సోమనాథ్, మోహన్‌రెడ్డి, సాయిరాంగౌడ్, సంపత్, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నరేష్, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేట : సేవా కార్యక్రమాలు చేపట్టటడం అభినందనీయమని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా గురువారం బీజేపీ జిల్లా నాయకురాలు కాట విజయ ఆధ్వర్యంలో భవానీ మందిరం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు గురువారం దిల్‌సుఖ్‌నగర్‌లోని జాతీయ రహదారి కిరువైపులా సర్వీసు రోడ్డును, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన పలు వ్యాపారులను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీ పీ చంద్రకుమార్ పర్యవేక్షణలో మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమా ర్, ఎస్ఐలు రాము, రామస్వామిలతో కూడిన బృందం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన పలు పండ్ల దుకాణాలను, చాయ్ విక్రయించే డబ్బాలు, చెరుకు బండ్లను తొలగించారు. వా హనాల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసినా, ఫుట్‌పాత్‌లను, సర్వీసు రోడ్లను ఆక్రమిస్తూ పండ్లు, ఇతర వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా గుర్తిస్తే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ తెలిపారు. ముందుగా దిల్‌సుఖ్‌నగర్‌లోని పూర్ణిమ ఫర్నిచర్ షాపు ముం దున్న సర్వీసు రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలను, డబ్బాలను తొలగించారు. అక్కడి నుంచి సర్వీసు రోడ్డుకు ఇటు వైపు ఉన్న దిల్‌సుఖ్‌నగర్‌లోని కమల ఆస్పత్రి ముందున్న టీ డబ్బాను, చెరుకు బండిని తొలగించారు. ఇంకా ఎవరైనా ఫుట్‌పాత్‌లను, రోడ్డును ఆక్రమిస్తూ వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నట్లుగా స్థానికులు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని ఏసీపీ తెలిపారు. వాటిపై తానే స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేటు వాటర్ ట్యాంకు సీజ్..

దిల్‌సుఖ్‌నగర్‌లోని హోటళ్లకు నీటిని సరఫరా చేస్తున్న ప్రైవేటు వాటర్ ట్యాంకర్‌ను ఏసీపీ చంద్రకుమార్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ పరిశీలించారు. వాటర్ ట్యాంకర్‌కు సంబంధించి సరైన పత్రాలను డ్రైవర్ చూపకుండా వాగ్వాదానికి దిగుతుండడంతో ముందుగా వాటర్ ట్యాంకర్‌ను సీజ్ చేసినట్లు ఏసీపీ వివరించారు. ఎవరైనా ప్రైవేటు వాటర్ ట్యాంకర్‌ను నీటి సరఫరా కోసం ఉపయోగించే ముందు సరైన పత్రాలను వాహనం వెంట ఉండేలా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తిస్తే డ్రంకెన్‌డ్రైవ్ కింద మరో కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786